గొల్లపూడి పోస్టాఫీసులో డిపాజిట్లు స్వాహా!

పోస్టుమెన్ నియమించుకున్న ప్రైవేటు వ్యక్తి నిర్వాకం

మూడురోజులుగా విచారణ చేస్తున్న అధికారులు

వైరారూరల్, ఆగస్టు 16 : పోస్టాఫీసులో ఖాతాదారులు డిపాజిట్ చేసుకున్న నగదును ఓ ప్రైవేటు వ్యక్తి రూ.లక్షల్లో స్వాహా చేసినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పోస్టుమెన్ నియమించుకున్న ఓ ప్రైవేటు వ్యక్తి ఈ నిర్వాకానికి పాల్పడ్డాడు. దీనిపై తపాలా శాఖ అధికారులు మూడు రోజులుగా విచారణ చేస్తున్నారు. గ్రామస్తుల కథనం ప్రకారం.. వైరా మండలం గొల్లపూడి తపాలా శాఖకు మేడూరి శ్రీనివాసరావు అనే వ్యక్తి పోస్టుమెన్. అతడికి అదే గ్రామంలో ఓ ఎరువుల దుకాణం కూడా ఉంది. అయితే దాని పక్కనే అతడు ఓ గదిని ఏర్పాటుచేసి అందులో పోస్టాఫీసు నిర్వహిస్తున్నాడు. ఖాతాదారుల డిపాజిట్ల సేకరణ సహా తపాల శాఖ కార్యకలాపాల కోసం ఓ ప్రైవేటు వ్యక్తి వరికూటి ప్రవీణ్‌కుమార్‌ను అందులో నియమించుకున్నాడు. అతడే ఈ పనులన్నీ పర్యవేక్షిస్తున్నాడు. అయితే తపాలా ఖాతాదారులు రోజువారీగా, నెలవారీగా తమ ఖాతాల్లో చేసే డిపాజిట్లను ఇతడు సేకరిస్తున్నాడు. 'ఎవరెవరు ఎంతెంత డిపాజిట్ చేశారు?' అనే వివరాలను అప్పటికప్పుడు వారి తపాలా పాస్ పుస్తకాల్లో రాసి, ముద్ర వేసి ఇస్తాడు. ఇక్కడ సేకరించిన డిపాజిట్లను అదే రోజు ప్రధాన శాఖకు వెళ్లి డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. అయితే సుమారు 70 మంది ఖాతాదారుల పాస్ పుస్తకాలను ఖాతాదారులకు ఇవ్వడంలేదని, వారి నుంచి సేకరించిన డిపాజిట్లను ప్రధాన శాఖలో డిపాజిట్ చేయడంలేదని, సుమారు 50 మంది ఖాతాదారులకు చెందిన రూ.లక్షల నగదును కాజేశాడని పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయి. దీంతో విషయం తెలుసుకున్న పోస్టల్ శాఖ జిల్లా ఉన్నతాధికారులు ఈ అంశంపై విచారణకు ఆదేశించారు. విచారణ అధికారులుగా మధిర పోస్టల్ ఇన్‌స్పెక్టర్ కోటేశ్వరరావు, కలకోట బ్రాంచ్ పోస్ట్‌మెన్‌లను నియమించారు. దీంతో వారు గడిచిన మూడు రోజులుగా గొల్లపూడి గ్రామంలో విచారణ చేపడుతున్నారు.

ఖమ్మంలోని ఓ ఇంట్లో మహాలక్ష్మి పూజ చేస్తున్న భక్తురాలు

ప్రొద్దుటూరులో పూజలు నిర్వహిస్తున్న మహిళలు

మా ఇంట కొలువుండు.. మా మహాలక్ష్మి

జిల్లా వ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీవ్రతం

పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారం రోజును వరలక్ష్మీ వ్రతంగా జిల్లాలోని మహిళలు అత్యంత భక్తిశ్రద్ధతలతో జరుపుకున్నారు. వరలక్ష్మీ వ్రతం సందర్భంగా పలు దేవాలయాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. మహిళలు ఎంతో పవిత్రంగా భావించే వరలక్ష్మీ వ్రతాన్ని వారు తమ ఇళ్లల్లో ఘనంగా నిర్వహించుకున్నారు. శుక్రవారం వేకువ జామునే నిద్రలేచి చన్నీటి స్నానాలు ఆచరించి నూతన పట్టు వస్త్రాలను ధరించారు. ఇంటి గుమ్మాలకు మామిడి తోరణాలను కట్టి శోభాయమానంగా తీర్చిదిద్దుకున్నారు. ఇంట్లో వరలక్ష్మీ అమ్మవారి ప్రతిమను కొలువుంచి ప్రత్యేక పూజలు చేశారు. తీరొక్క పూలతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. వివిధ రకరకాల పిండివంటకాలు, పండ్లు, తీరొక్క స్వీట్లు తయారు చేసి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. 'రావమ్మా మహాలక్ష్మి.. రావమ్మా..' అంటూ లక్ష్మీదేవిని తమ ఇళ్లకు ఆహ్వానించారు. అంతేగాక ఉదయం వ్రతమాచరించిన మహిళలను సాయంత్రం తమ ఇళ్లకు ఆహ్వానించి వాయినం అందజేశారు. పలు ఆలయాల్లో కమిటీ సభ్యులు సామూహిక వరలక్ష్మీ వ్రతాలను నిర్వహించారు. శ్రావణమాసం రెండో శుక్రవారం సందర్భంగా పాండురంగాపురంలోని శ్రీమహాలక్ష్మి అమ్మవారి దేవాలయం భక్తులతో కిక్కిరిసి కనిపించింది.

– నమస్తే నెట్‌వర్క్

మధిరలో అమ్మవారికి ప్రత్యేక అలంకరణ

ఆశీర్వాదం తీసుకుంటున్న మహిళ

మద్దులపల్లి ఏఎంసీ పాలకవర్గం ఖరారు!

ఖమ్మం రూరల్, ఆగస్టు 16: మద్దులపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం కొద్ది రోజుల్లోనే కొలువుతీరే అవకాశం కన్పిస్తోంది. వారం రోజుల క్రితం కల్లూరు, సత్తుపల్లి మార్కెట్ కమిటీల్లో నూతన పాలకవర్గాలు కొలువుదీరిన విషయం విదితమే. తాజాగా పాలేరు నియోజకవర్గంలోని మద్దులపల్లి వ్యవసాయ మార్కెట్‌కు సంబంధించిన నూతన పాలకవర్గ జాబితా కూడా రాష్ట్ర మార్కెటింగ్‌శాఖకు చేరింది. పాలేరు ఎమ్మెల్యే, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి సిఫార్సుతో 15 మందితో కూడిన జాబితాకు ఒకటి రెండు రోజుల్లో అధికారిక ముద్ర పడే అవకాశం ఉంది. వీరిలో ఇద్దరు వ్యాపారులకు, ఒక సొసైటీ చైర్మన్‌కు అవకాశం కల్పించనున్నారు. ఖమ్మం రూరల్ మండలానికి చైర్మన్ పదవితోపాటు ఏడుగురు డైరెక్టర్ల పదువులను, తిరుమలయపాలెం మండలానికి వైస్ చైర్మన్ పదవితోపాటు ఆరుగురు డైరక్టర్ల పదవులను కేటాయించే అవకాశం ఉంది. కాగా, ఇప్పటికే రూ.19 కోట్లతో చేపట్టిన ఏఎంసీ నిర్మాణ పనులను ఆరు నెలలుగా పూర్తిగా నిలిచిపోయిన విషయం విదితమే.

ఖమ్మంలో పర్యటించిన మంత్రి తుమ్మల

ద్విచక్ర వాహనంపై పర్యటిస్తూ సమస్యలను తెలుసుకుంటున్న మంత్రి తుమ్మల

ఖమ్మం, ఆగస్టు 16 : రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు శుక్రవారం ఖమ్మం నగరంలోని త్రీ టౌన్ ప్రాంతంలో ద్విచక్ర వాహనంపై పర్యటించారు. నగర మేయర్ పునుకొల్లు నీరజ, మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్యతో కలిసి పర్యటించి పలు సమస్యలు తెలుసుకున్నారు. అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం ఖమ్మం మార్కెట్ ఏరియా, ప్రకాష్‌నగర్‌లో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. ధంసలాపురం ఎగ్జిట్ పాయింట్ దగ్గరికి వెళ్లి ఎగ్జిట్ పనులను పరిశీలించి త్రీ టౌన్ ప్రాంతానికి కలిపే రోడ్డుని డబుల్ రోడ్డు ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సాధు రమేష్‌రెడ్డి, కమర్తపు మురళి, రమేష్, అంజిరెడ్డి, ఉపేందర్ పాల్గొన్నారు.

మంత్రి తుమ్మలకు రాఖీ కట్టిన బ్రహ్మకుమారీలు

రఘునాథపాలెం, ఆగస్టు 16 : రక్షాబంధన్‌ను పురస్కరించుకొని బ్రహ్మకుమారీలు శుక్రవారం రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ నాయకులు సాధు రమేశ్‌రెడ్డి, కమర్తపు మురళి ఉన్నారు.

బీఆర్ఎస్ నాయకుడు అప్జల్ మృతి

నివాళి అర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

రఘునాథపాలెం, ఆగస్టు 16 : ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, రాంక్యాతండా మాజీ సర్పంచ్ షేక్ అప్జల్ శుక్రవారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకులు మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పీఏ రవికిరణ్, బీఆర్ఎస్ ఖమ్మం నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, మండల అధ్యక్షుడు అజ్మీరా వీరూనాయక్, మాజీ వైస్ ఎంపీపీ గుత్తా రవికుమార్, మందడపు నర్సింహారావు, ఆత్మ చైర్మన్ భూక్యా లక్ష్మణ్‌నాయక్, దొంతు సత్యనారాయణ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ గుండ్ల ముత్తయ్య, పార్టీ యూత్ అధ్యక్షుడు గంగిరెడ్డి విజయ్‌రెడ్డి, జాటోతు సూర్య, గ్రామ మాజీ సర్పంచ్ అమాలి, తారాచంద్, మాజీ ఎంపీపీ మాలోతు శాంత తదితరులు అతడి గ్రామానికి వెళ్లి అప్జల్ మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. అంత్యక్రియల నిమిత్తం రూ.10 వేలు అందజేశారు. అప్జల్ మృతి పట్ల మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ సంతాపం తెలిపారు.

ప్రకటన

ఇందుమూలముగా నాక్లయింటు అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, **మరిపెడ బ్రాంచ్** వారు ఇచ్చిన బోగట్టా ప్రకారం యావన్మందికి తెలుపునది. ఈ క్రింది షెడ్యూలు చూపిన స్థిరాస్తిని రిజిస్ట్రర్ తనఖా చేయించుకొని **బానోత్ సుజాత**, W/o : **బానోత్ లక్ష్మి**, D/o : **బోడ బాల్య**, **వయస్సు** : 31 సం॥లు, **వృత్తి** : గృహిణి, **నివాసం** : బాల్యతండ్ర గ్రామం, మరిపెడ మండలం, మహబూబాబాద్ జిల్లా గారికి ఋణం ఇచ్చుటకు నిర్ణయించుకున్నారు. కావున సదరు వ్యవహారమునకు సంబంధించి సదరు షెడ్యూల్ స్థిరాస్తిపై ఎవరికైననూ ఎటువంటి జప్తులు చార్జీలు, క్రెయిములు, తనఖాలు అగ్రిమెంట్‌లు, కోర్టు వివాదములు తదితర అభ్యంతరములు ఉన్నయెడల నేటి నుండి **5** రోజులలో ఈ క్రింద చూపిన చిరునామాకు వ్రాతపూర్వకముగా తెలియజేయగలరు. తదుపరి వచ్చు అభ్యంతరములకు నా క్లయింటు బాధ్యులు కారు.

షెడ్యూలు ఆస్తి : ఖమ్మం రిజిస్ట్రేషన్ జిల్లా కూసుమంచి సబ్ జిల్లా ఖమ్మం జిల్లా ప్రజా పరిషత్ సబ్ రిజిస్ట్రార్ కూసుమంచి, తిరుమలాయపాలెం మండలం, మహ్మదాపురం గ్రామ పంచాయితి పరిధిలో, మహ్మదాపురం రెవిన్యూ గ్రామ సర్వే నెం. 128, 129/ఇ, 129/ఇ, 129/ఈ, 137/ఆ మిం.లే. విస్తీర్ణము. చ॥గ॥ 160-00 = 133-77 చ॥మీ॥, **డాక్యుమెంట్ నెం. 179/2022** గల స్థిరాస్తి నివేశన ఖాళీ స్థలమునకు హద్దులు : **తూర్పు**: జాటోతు బాలు గారి ఖాళీ స్థలం, **పడమర** : కత్రోజు వెంకటాచారి గారి ఖాళీ స్థలం, **ఉత్తరం** : ఖమ్మం నుండి వరంగల్ పోవు ఆర్ & బి రోడ్డు, **దక్షిణం** : కత్రోజు వెంకటాచారి గారి ఖాళీ స్థలం.

జి.హరేందర్ రెడ్డి
అడ్వకేట్, ఖమ్మం. సెల్ : 9848022542

NOTICE

Under the instructions of my client M/S Shriram Finance Ltd. **Kalluru Branch** Rep.by its Branch manager it is stated that one **Smt. Ekkirala Geetha,** w/o. Krishna, 34 years, 8-35/A, CSI Church Road, Wyra town and mandal, Khammam district, are creating mortgage against her property shown below as surety for the proposed loan. if anybody having any objection, they can send the objections to me or to my client within 3 days from the date of publication of this notice and further objections if any shall not bind my client.

PROPERTY TO BE MORTGAGED

ACC roofed House with a plinth area of 120 Sq.feet along with its site to an extent of 81.93 Sq.yards, bearing H.No. 8-47/C (H.No. 8-210001/A/1) situated at 8th Ward, Wyra Municipal limits, Wyra town and mandal, Khammam district, SRO Limits of Wyra, bounded by : **East :** Municipal Road, **South:** Property of Tiruvaipati Venkata Krishnaiah Suri & Tiruvaipati Venakata Suri, **West :** Municipal Road, **North :** Place of Teerdham Nagasai Harika

P.GANESH BABU
Advocate, Kothagudem.
Cell : 9849246278

Kothgaudem
Date:16-07-2024

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

మంచం పట్టిన ఆళ్లపాడు

ఇంటికి ఇద్దరు, ముగ్గురు చొప్పున జ్వరాలు

గ్రామంలో పలువురికి చికున్‌గున్యా నిర్ధారణ

జ్వరాలతో బాధపడుతున్న తోటకూర వెంకటేశ్వర్లు, రమేశ్

బోనకల్లు, ఆగస్టు 16 : మండలంలోని ఆళ్లపాడు గ్రామం మంచం పట్టింది. గ్రామంలో ఇంటికి ఇద్దరు, ముగ్గురు చొప్పున జ్వరంతో బాధపడుతున్నారు. రెండు నెలలుగా ఈ గ్రామంలో జ్వరాల తీవ్రత అధికంగానే ఉంటోంది. ఈ గ్రామంలో జ్వరంతో బాధపడుతున్న ఓ మహిళ రెండు నెలల క్రితం మరణించిన విషయం విదితమే. వైద్యాధికారులు తాత్కాలికంగా వైద్యశిబిరాలు ఏర్పాటు చేస్తున్నారు తప్ప జ్వరాల నిర్మూలనకు పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోలేదు. ఆరేళ్ల క్రితం కూడా ఈ గ్రామంలో అనేకమంది డెంగీ జ్వరాల భారిన పడి పలువురు మృత్యువాత పడిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం కూడా ఇంటికి ఇద్దరు, ముగ్గురు చొప్పున జ్వరాల భారిన పడ్డారు. ప్రతి రోజూ 10 నుంచి 20 మంది రోగులు ఖమ్మం, మధిర, బోనకల్లుల్లోని ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స కోసం పరుగులు పడుతున్నారు. గ్రామానికి చెందిన తోటకూర వెంకటేశ్వరరావు చికున్‌గున్యా జ్వరంతోపాటు కీళ్లనొప్పులతో నీరసించి మధిరలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. అదే గ్రామానికి చెందిన షేక్ మొహమ్మద్‌అలీ, ఆయన భార్య కూడా చికున్‌గున్యాతో బాధపడుతున్నారు. ఎస్సీ కాలనీలో మొండితోక పెద్దఏసు, వేల్పుల రమేశ్, అల్లిక రాములు, వెంకట్రావమ్మ, గడుబోతుల నాగమ్మ గత కొన్ని రోజులుగా జ్వరాలతో బాధపడుతున్నారు.

ఆరు గ్యారెంటీలను అమలుచేయాలి : ఎంఎల్

తిరుమలాయపాలెం, ఆగస్టు 16: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ పాలేరు డివిజన్ కార్యదర్శి బందెల వెంకయ్య డిమాండ్ చేశారు. మండలంలోని పిండిప్రోలులో శుక్రవారం జరిగిన పార్టీ మండలస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ హామీల అమలు కోసం ఈ నెల 22న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పోస్టర్‌ను ఆవిష్కరించారు. పార్టీ నాయకులు కమ్మకొమటి నాగేశ్వరావు, తిమ్మిడి హనుమంతరావు, సోమనపల్లి వెంకటేశ్వర్లు, పులుగుజ్జు వెంకటస్వామి, యడ్లపల్లి నవీన్ పాల్గొన్నారు.

పెద్దాసుపత్రిలో రక్తదాన శిబిరం

ఖమ్మం సిటీ, ఆగస్టు 16 : జిల్లా సార్వజనీన ఆసుపత్రిలో విశ్వ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఎస్సీ కార్పొరేషన్ డీడీ కస్తాల సత్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సకాలంలో రక్తం అందక అనేకమంది ప్రాణాలను కోల్పోతున్నారని, విశ్వ చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో స్తంభాద్రి హాస్పిటల్ డాక్టర్ గట్టినేని సురేష్, ఎస్‌బీఐ మేనేజర్ వీవీ సాగర్, ట్రస్ట్ చైర్మన్ పాపగంటి శ్రీధర్, మన్నె సురేష్, దుంపల రవి, పగిడిపల్లి హరీష్, మంద సతీష్, మోదుగు బాబు, దర్శి కమల్, మురళి పాపారావు, కే బాలరాజు పాల్గొన్నారు.

'మత్తు పదార్థాలతో జీవితం నాశనం చేసుకోవద్దు'

ఖమ్మం ఎడ్యుకేషన్, ఆగస్టు 16 : యువత మత్తు పదార్థాలకి బానిసలై తమ భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని వన్‌టౌన్ సీఐ ఉదయ్‌కుమార్, టీజీఏఎన్‌బీ ఇన్‌స్పెక్టర్ రాము అన్నారు. శుక్రవారం నగరంలోని ఏఎస్ఆర్ కళాశాలలో యాంటీ నార్కోటిక్స్ బ్యూరో ఆధ్వర్యంలో మత్తు పదార్థాల వాడకం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

'నింబితులను అరెస్ట్ చేయాలి'

కలకత్తా నగరంలో విధులు నిర్వహిస్తున్న డాక్టర్‌పై అత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఇటికల రామకృష్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం నగరంలోని అత్యాచారాన్ని నిరసిస్తూ కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. సెంట్రల్ ప్రొటెక్షన్ యాక్ట్ అమలు చేయాలని, మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టాలన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు రాకేష్, ప్రతాప్, రోహిత్, వెంకటేష్, సాయి, గోపి తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌బీఐటీ విద్యార్థికి అభినందన

ఖమ్మం ఎడ్యుకేషన్, ఆగస్టు 16 : నగరంలోని ఎస్‌బీఐటీ కళాశాలకు చెందిన విద్యార్థి శివకౌషిక్ ఇంటింటా ఇన్వోవేటర్‌లో ప్రతిపాదించిన ఆలోచనను కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అభినందించారని కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రశంసాపత్రం అందజేశారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని కరస్పాండెంట్ డాక్టర్ జీ ధాత్రి, ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు.

అప్రమత్తతతోనే వ్యాధుల నియంత్రణ

పెనుబల్లి, ఆగస్టు 16 : వర్షాకాలంలో వచ్చే వ్యాధుల పట్ల అవగాహన పెంచుకొని అప్రమత్తంగా ఉంటేనే వ్యాధుల నియంత్రణ సాధ్యమవుతుందని జనవిజ్ఞాన వేదిక ప్రతినిధి, రచయిత ఎం.రాంప్రదీప్ అన్నారు. శుక్రవారం వీఎం బంజరలోని స్థానిక లక్ష్య టాలెంట్ స్కూల్‌లో జేవీవీ ఆధ్వర్యంలో జరిగిన 'సీజనల్ వ్యాధులు– తీసుకోవాల్సిన జాగ్రత్తలు' అనే అంశంపై ఆయన మాట్లాడారు. అనంతరం కరపత్రాలను విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జేవీవీ ప్రతినిధి సీహెచ్ నరసింహారావు, పాఠశాల ప్రిన్సిపాల్ పీ.ఈశ్వర్ పాల్గొన్నారు.

22న చలో హైదరాబాద్

సత్తుపల్లిటౌన్, ఆగస్టు 16 : ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలన్నింటినీ వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ఆధ్వర్యంలో ఈ నెల 22వ తేదీన తలపెట్టిన 'చలో హైదరాబాద్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ డివిజన్ కార్యదర్శివర్గ సభ్యుడు అమర్లపూడి శరత్, మండల కార్యదర్శి తాటి రాజు కోరారు. శుక్రవారం సత్తుపల్లి పట్టణంలోని గుడిపాడులో పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో దుంప రాఘవులు, కోర్సు వెంకటేశ్, చిన్నభద్రం, సురేష్, మారుతి, శ్రీను పాల్గొన్నారు.

'గంగారం సొసైటీలో సభ్యులకు అన్యాయం'

సత్తుపల్లిటౌన్, ఆగస్టు 16 : మండల పరిధిలోని గంగారం సొసైటీకి చెందిన భూముల విషయంలో సభ్యులుగా ఉన్న తమకు తీరని అన్యాయం చేస్తున్నారని కొందరు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం గంగారం గట్టుబజారులో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. 25మంది సభ్యుల్లో 9మంది ఇతర ప్రాంతాలకు వెళ్లారని, ఎస్టీకాలనీకి చెందిన సభ్యులు రికార్డులు తమ దగ్గర ఉన్నాయనే ధైర్యంతో తమను మా భూముల దరిదాపులకు రానీయడం లేదని బాధిత సభ్యులు వాపోయారు. ఈ సమావేశంలో ఈకే రమేష్, సోయం వెంకటేశ్వరరావు, సోయం గోవిందరావు, ఊకే వెంకన్న, ఊకే పొట్టి, సోయం కోటేశ్వరరావు, సవలం ప్రసాద్ పాల్గొన్నారు.

'సీఎం కప్'లో బాల్‌బ్యాడ్మింటన్ క్రీడను చేర్చాలి

బోనకల్లు, ఆగస్టు 16: చీఫ్ మినిస్టర్స్ కప్ 2024 క్రీడల జాబితాలో బాల్‌బ్యాడ్మింటన్ క్రీడను కూడా చేర్చాలని సీనియర్ బాల్‌బ్యాడ్మింటన్ క్రీడాకారుడు షేక్ అజ్గర్ కోరారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర క్రీడా అథారిటీ చైర్మన్ శివసేనరెడ్డికి హైదరాబాద్‌లో శుక్రవారం వినతిపత్రాన్ని అందజేశారు.

ఇళ్లు, స్థలాలు కేటాయించాలి

చింతకాని, ఆగస్టు 16: మండలంలో జగన్నాథపురం గ్రామంలో ఓ ప్రైవేటు కార్యక్రమానికి వచ్చిన డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను మండలంలోని పలు గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు కలిశారు. ఈ సందర్భంగా బస్వాపురం గ్రామస్తులు ఆయనతో మాట్లాడారు. గ్రామంలో కొంత ప్రభుత్వ భూమి ఉన్నందున ఇళ్లు లేని నిరుపేదలకు దాంట్లో ఇళ్లు నిర్మించి ఇవ్వాలని, ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరారు. ఈ మేరకు వినతిపత్రంతో అందించారు.

కరపత్రం ఆవిష్కరణ

కూసుమంచి,ఆగస్టు 16: ఆది జాంబవ మహారాజ్ విగ్రహావిష్కరణ కరపత్రాన్ని ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందా కృష్ణ మాదిగ శుక్రవారం హైదరాబాద్‌లో ఆవిష్కరించారు. కూసుమంచి మండలం గైగోళ్లపల్లిలో నిర్మించిన ఈ విగ్రహావిష్కరణకు నిర్వాహకుడు విజయ్‌కుమార్.. మందా కృష్ణమాదిగను ఆహ్వానించారు. దీంతో ఆయన ఆవిష్కరణకు వచ్చేందుకు అంగీకరించారు. అనంతరం కరపత్రం ఆవిష్కరించారు. ఫ్రెండ్స్ యూత్ బాధ్యులు సత్యం, నాగయ్య, మధు,చంటి, బొబ్బలి పరశురాం, మట్టి రాజీవ్ పాల్గొన్నారు.

'విద్యలో రాణిస్తేనే భవిష్యత్'

మధిర, ఆగస్టు 16: విద్యలో ఉన్నతంగా రాణించినప్పుడే విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉంటుందని, మెరుగైన అవకాశాలు లభిస్తాయని ఎస్‌జేకేఎం విద్యాసంస్థల డైరెక్టర్ డీ.సత్యనారాయణరెడ్డి అన్నారు. స్థానిక శ్రీనిధి డిగ్రీ కళాశాలలో కళాశాల చైర్మన్, ప్రిన్సిపాల్ బీ.అనిల్‌కుమార్‌నెహ్రూ అధ్యక్షతన శుక్రవారం జరిగిన కళాశాల ఫ్రెషర్స్‌డే వేడుకల్లో ఆయన మాట్లాడారు. జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ అండ్ డైరెక్టర్ రమేష్, డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ బుచ్చిబాబు, ఏవో సాంబ పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతి

తిరుమలాయపాలెం, ఆగస్టు 16: తిరుమలాయపాలెం ప్రభుత్వ ఉన్నత పాఠశాల్లో ఈ ఏడాది 10వ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన ఇద్దరు విద్యార్థులకు పాఠశాల పూర్వ విద్యార్థి దారావత్ రాములు రూ.10 వేల నగదు బహుమతి అందజేశారు. పాఠశాల్లో శుక్రవారం జరిగిన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. అత్యధిక మార్కులతో ప్రథమస్థానం సాధించిన బదావత్ భవ్యశ్రీకి రూ.6,116. ద్వితీయ స్థానం సాధించిన మద్దినేని సాయిచరణ్యకు రూ.4,116తోపాటు షీల్డ్ అందజేశారు. తన తండ్రి గోలియా జ్ఞాపకార్థం ఈ బహుమతులు అందజేస్తున్నట్లు తెలిపారు. సుబ్లేడులో హైస్కూల్ ఉపాధ్యాయురాలు లావణ్య.. గ్రామానికి చెందిన వికలాంగుడు పుల్లయ్యకు ట్రైసైకిల్ అందజేశారు.

'అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూమిని వెలికితీయాలి'

తిరుమలాయపాలెం, ఆగస్టు 16: తిరుమలాయపాలెంలో అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూమిని ప్రభుత్వం వెలికితీసి ప్రజావసరాలకు వినియోగించాలని ప్రతిపక్షనాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తిరుమలాయపాలెంలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమిని పలు పార్టీల నాయకులు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. హైవేకు ఆనుకొని ఉన్న 254 సర్వేనెంబర్లలోని 9.11 ఎకరాల్లో కొంత భూమిని అధికార పార్టీ నాయకుడు ఆక్రమించుకొని సాగు చేస్తున్నట్లు ఆరోపించారు. ఆ భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకొని ఐటీఐ కళాశాలను నిర్మించాలని కోరారు. బీఆర్ఎస్, సీపీఎం ప్రజా పంథా, బీఎస్పీ, మాస్‌లైన్ నాయకులు కొమ్ము శ్రీను, సోమనపల్లి వెంకటేశ్వర్లు, కొమ్ము పూలే,గంట కృష్ణ, పోలెపొంగు వెంకటేశ్వర్లు, మట్టి దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

వైరా టౌన్, ఆగస్టు 16: లయన్స్ క్లబ్ బాధ్యులు నిరుపేదలకు ఉపయోగపడేలా సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమని క్లబ్ జోన్ చైర్మన్ పెనుగొండ ఉపేంద్రరావు అన్నారు. లయన్ మిట్టపల్లి వెంకటరమణ పుట్టినరోజు సందర్భంగా క్లబ్ ఉపాధ్యక్షుడు కొల్లా రాంబాబు అధ్యక్షతన ఇద్దరు నిరుపేద మహిళలకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. అలాగే, తల్లి మరణంతో ఆర్థికంగా ఇబ్బంది పడుతూ గుడిసెలో నివసిస్తున్న నిరుపేద వ్యక్తికి ఆర్థిక సహాయాన్ని అందించారు. క్లబ్ బాధ్యులు కొల్లా రాంబాబు, మరికంటి రాంగోపాల్, చింతోజు నాగేశ్వరరావు, మిట్టపల్లి శివనాగభూషణం, రాము, సురేశ్ పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ విద్యార్థినికి ఆర్థిక సాయం

వైరా టౌన్, ఆగస్టు 16: బ్రాహ్మణపల్లికి చెందిన ఇంజినీరింగ్ విద్యార్థిని అఖిలకు కాలేజీ ఫీజుల నిమిత్తం రూ.20 వేల ఆర్థిక సాయాన్ని వైరా లయన్స్ క్లబ్ బాధ్యుడు డాక్టర్ కాపా మురళీకృష్ణ అందించారు. వైరాలో శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ఆర్థిక స్థోమత లే